## పేషెంట్ చెప్పే కథలు




"విూరు తల్లి కాబోతున్నారు" గర్భ నిర్ధారణ చేసింది శ్రుతి. మెల్లగా ఎగ్జామినేషన్ కౌచ్ దిగివచ్చి శ్రుతికి ఎదురుగా కూర్చుంది అమరేశ్వరి. శ్రుతి ఊహించినట్లు ఆమె ముఖం సంతోషంతో విప్పారలేదు. అంత మంచివార్తను విన్న ఉద్వేగంతో 'థాంక్ యూ' అనలేదు. శ్రుతికి తెలిసినంతవరకు అమరేశ్వరి కొంచెం లేట్‌గానే వివాహం చేసుకుంది. ఇన్నాళ్ళకు వివాహమయి, తల్లి కాబోతుంటే సంతోషంతో ఉక్కిరి బిక్కిరయే ఆడవాళ్ళనే చూసిందికాని యింత నిర్లిప్తంగా కూర్చునే వ్యక్తిని చూడడం ఇదే ప్రథమం. "ఆర్ యు నాట్ హేపీ? తల్లి కాబోతున్నానన్న భావన మీకు సంతోషాన్ని కలిగించడంలేదా?" ఉత్సుకంగా చూసింది శ్రుతి.

"పెళ్ళి చేసుకుని కాపురం చేస్తున్నదాన్ని. తల్లికావడంలో పెద్ద విశేషమేముంది?" శ్రుతివంక వింతగా చూసింది అమర. ఆమె ప్రశ్నకు తొట్రుపడి గుక్క తిప్పుకోవడానికో నిమిషం పట్టింది శ్రుతికి.

"వెల్" సర్దుకుంటూ చిన్నగా నవ్వి, ఆమె వివరాల్ని కేస్‌షీట్ మీద వ్రాయసాగింది శ్రుతి.

"డాక్టర్!" అమర పిలుపు విని తలెత్తింది శ్రుతి.

"బ్లడ్ టెస్ట్స్ చెయ్యాల్సిన అవసరం లేదా?"

"చెయ్యాలి. బ్లడ్ తీసుకుంటామిప్పుడు" అవసరమైన పరీక్షల్ని అడిగి చేయించుకోవాలనే ఆలోచన కొంతమంది మహిళలకైనా వస్తున్నందుకు సంతోషపడింది శ్రుతి.

"ఎందుకడుగుతున్నానంటే .... మా వారికి పెళ్ళికిముందు కొన్ని అలవాట్లుండేవి. సుఖవ్యాధులు వున్నాయేమోనని నా అనుమానం. నాకాయన అలవాట్ల గురించి తెలిసి బ్లడ్ టెస్ట్స్ చేయించుకునే లోగానే పీరియడ్ మిస్ అయాను. అలాంటి వ్యాధులేవైనా ఆయనకు వుండివుంటే నాకు, నా నుంచి నా కడుపులో పెరుగుతున్న బిడ్డకు అంటే ప్రమాదముంది కదా!" సూటిగా యెలాంటి సంకోచాలూ, నదురూ, బెదురూ లేకుండా తన సమస్యను శ్రుతికి చెప్పింది అమర. అమర ధోరణి కొత్తగావుంది శ్రుతికి. భయం భయంగా, గిల్టీగా, సగం దాచి సగంచెప్పే ఆడవారినీ, అలాంటి తిరుగుబోతుభర్త లభించినందుకు క్రోధంతో మండిపడుతూ అతన్నీ, విధినీ తూర్పారబట్టేవారినీ చూసింది కాని, పరిస్థితిని యింత నిబ్బరంగా స్వీకరించే మహిళ తారసపడడం యిదే మొదటిసారి.

"మీరు చెప్పేదిరైటే. ఇప్పుడు నేను చేయించబోయే పరీక్షల్లో దానికి సంబంధించినది కూడా వుంటుంది." కేస్ షీట్ వ్రాయడం పూర్తిచేసి బ్లడ్ తీసుకుంది శ్రుతి. "వాళ్ళంతట వాళ్లు అడిగి చేయించుకోకపోతే మానె, కనీసం డాక్టర్లు చెప్పినప్పుడైనా నిర్లక్ష్యం చేయకుండావుంటే ఎన్నో గర్భస్రావాల్ని, మృత శిశు జననాల్ని నివారించవచ్చు. శారీరక, మానసిక వికలాంగులు పుట్టకుండా జాగ్రత్తపడవచ్చు" తన ధోరణిలోతను ఆలోచిస్తూంది శ్రుతి.

"ఒక అరగంట కూర్చోగలరా? రిపోర్ట్ చూసి మందులు వ్రాసిస్తాను." కేస్ షీట్ అలమర ముందుకు జరుపుతూ అడిగింది శ్రుతి.

"కూర్చుంటాను." లేచి బయటకు వెళ్ళబోయింది అమర.

"ఒక్క నిమిషం కూర్చోండి.... మీరేమీ అనుకోనంటే చిన్న ప్రశ్న."

"అడగండి." చిరునవ్వు విరిసిందామె అధరాలమీద. ఒక నిమిషం తటపటాయిస్తూ వుండిపోయింది శ్రుతి.

"మీ భర్త అలవాట్లు.. ఈ విషయాన్ని మీరింత తేలిగ్గా ఎలా తీసుకోగలుగుతున్నారు? మీకేమీ బాధలేదా?" ఈమె హృదయం సంతోషానికీ, బాధకూ అతీతంగా మారిపోయిందా!! అంచేతే ఏ అనుభూతుల ఒత్తిడికీ లొంగకుండా నిర్వికారంగా చెప్పగలుగుతూందా? - ఆమె ఏం జవాబిస్తుందోనని కుతూహలంగా ఎదురుచూస్తూంది శ్రుతి.

"ఇందులో బాధపడడానికేముంది?... యిప్పుడు మా వారి వయసెంతో తెలుసా? ముప్పైఎనిమిది. ఆయన కుటుంబ బాధ్యతలు ఆయన్ని, నా పరిస్థితులు నన్ను పెళ్ళి చేసుకోకుండా ఆపాయి. బాధ్యతలు వేరు. శారీరకమైన ఉద్రేకాల్ని నిగ్రహించుకోవడం వేరు. ఇన్నేళ్ళొచ్చిన మగవాడు అస్ఖలిత బ్రహ్మచారిగావుంటాడనిఆశించడం, ఒకవేళ అలా వుండకపోతే నాకేదో అన్యాయం జరిగిపోయిందని రాద్ధాంతం చెయ్యడం వెర్రితనం కాదా?" రెప్ప వాల్చకుండా వింటూందామె మాటల్ని శ్రుతి.. ఐతే, అలాంటి అలవాట్లు తప్పులేనివని ఈమె అభిప్రాయమా? లేక తప్పనిసరై సర్దుకుపోతూ సమర్థిస్తూందా? మనసులో యెలాంటి నియమాలు, సిద్ధాంతాలపట్ల ఆకర్షణ, నమ్మకంవున్నా నూటికి నూరుపాళ్ళు శీలం, పవిత్రతలమీద గొప్ప అభిప్రాయాల్ని వెలిబుచ్చుతూ మాట్లాడే వనితల్నే చూడడంవల్ల అమర నిర్భయత్వం ఆకర్షణీయంగా కనపడింది శ్రుతికి.

"కాని...." ఒకక్షణం ఆగి తేరుకుని ప్రశ్నించబోయింది శ్రుతి.

"మీరడగబోయే దేమిటోనాకుతెలుసు. నాకిలాంటి వ్యవహారాలుంటే నా భర్త యింత తేలిగ్గా తీసుకుంటాడా, యింత సహజంగా తీసుకుని నాతో సరిగ్గా కాపురం చేస్తాడా అనికదూ? యిద్దరికీ సమానమైన న్యాయం వుండాల్సిన పరిస్థితిలో అతనికంటే చదువులోను, సంపాదనలోనూ ఏ విధంగానూ తీసిపోని నేను యింత లొంగుబాటుగా ప్రవర్తించడం నా వ్యక్తిత్వానికి మచ్చకాదా అని కదూ మీరు ప్రశ్నించేది?" ఆశ్చర్యంగా తన మనసులోని ప్రశ్నల్ని అమర నోటివెంట వింటూంది శ్రుతి. కాని యింకా కొన్ని ప్రశ్నలుండిపోయాయి శ్రుతి మనసులో.

ఒకదానికొకటి సంబంధంలేని ప్రశ్నలన్నీ కలిసి ఒక చిక్కుముడి తయారయింది.

"నేను ఉద్రేకాలు లేని మనిషిని కాదు. కాని ఏవేవో ఇన్హిబిషన్స్. ఈ సమాజం ఆడదానికి పెట్టిన అనేకమైన ఆంక్షలు. వ్యక్తిగా నాకున్న నమ్మకాలు నా ఉద్రేకాల్ని చంపేశాయి. కేవలం ఈ దేశంలో ఆడపిల్లగా, అదీ మధ్యతరగతి ఆడపిల్లగా పుట్టి పెరగడంవల్లే నేనిలావుండగలిగాను. మగవాడిగా పుడితే అతనిలానే ప్రవర్తించడానికే ఎక్కువ అవకాశముందనిపిస్తుంది నాకు. అంటే- తప్పేదైనావుంటే అది అన్ని అవకాశాలూ, అధికారాలూ మగవాడికి కట్టబెట్టిన సంప్రదాయానిదికాని. వ్యక్తిగా నా భర్త తప్పేంలేదనే నిర్ణయాని కొచ్చాను." ఏమాత్రం ఆవేశం లేకుండా చెప్పసాగింది అమర. ఆమె సిద్ధాంతాలు పూర్తిగా మింగుడుపడడం లేదు శ్రుతికి.

"ఐతే యిదంతా మీకు సహజంగా కనిపిస్తోందా?" ఆమెతో చర్చ ఆసక్తికరంగా వుంది శ్రుతికి. తరువాత చూడాల్సిన పేషెంట్స్ ఎవరూ లేకపోవడంవల్ల తీరిగ్గాకూడా వుంది.

"నాకెలా కనిపిస్తోందన్నదికాదు సమస్య. యిప్పుడున్న పరిస్థితి యిది. యీ పరిస్థితిలో ఆత్మగౌరవాన్ని కోల్పోకుండా బ్రతుకులోని తీపిని ఎంత ఎక్కువగా అనుభవించగలం అని ఆలోచిస్తున్నాను.... జీవితం చాలా చిన్నది. అందులో దాదాపు సగభాగం గడిచిపోయింది. గడిచిపోయినవాటి గురించి, ఎంత ప్రయత్నించీ తిరిగి సరిచేయలేనివాటి గురించి తల బ్రద్దలు కొట్టుకుంటూ తన జీవితంతోపాటు ఎదుటివాడి జీవితాన్ని కూడా నరకం చెయ్యడం మంచిది కాదనిపించింది....దంపతులకు కావలసిందివేర్వేరుగా గడిచిపోయిన గతంకాదు. ఒకటిగా నడుస్తున్న వర్తమానం. ఒకటిగా నడవవలసిన భవిష్యత్తు.. గతంతో రాజీపడక పోవడం తెలివితక్కువ. వర్తమానంతో రాజీపడిపోయి బ్రతకడం అసమర్థత." శ్రుతి మనసులోని చిక్కుముడి మరింత జటిలం కాసాగింది. అమరమాటల్తో. విలువలు, తప్పొప్పుల ప్రమాణాలు మారిపోతున్నాయి. అవి కొద్దో, గొప్పో ఆడ, మగ యిద్దరికీ వర్తిస్తున్నాయి. ఈ పరిస్థితిలో కొంత రాజీ, కొంత తిరుగుబాటు, కొంత కన్ఫ్యూషన్ తప్పవేమో! - అమర వంక చూస్తున్న శ్రుతిలో ఆలోచనల వలయాలు లేస్తున్నాయి.

# ఇంక్రిమెంట్



జొరా శర్మ

"రండి రండి! మేస్టారు! ఈ మధ్య బొత్తిగా నల్లపూసయ్యారు. అసలు దర్శనాలే లేవు" అంటూ మా ఇంటాయన (అంటే, మా హౌసోనరు) ఆప్యాయంగా పిలుస్తుంటే ఆ ప్రసన్న వదనాన్ని తిలకించి పులకించి "సర్వవిఘ్నోపశాంతయే" అనుకొంటూ ఇంటాయన ఇంట్లోకి అడుగుపెట్టాను. పిల్లనిచ్చిన మామగార్లా ఎన్నెన్ని కుశల ప్రశ్నలు! పడుచు పెళ్ళాం ఓరచూపులా ఎంత చక్కిలిగింత! ఒక్కసారి మా పెద్దాఫీసరు నాకొక్కడికే శాలువా గప్పి సన్మానం జేసినంత ఆనందం! నామీద నాకే హాశ్చర్యం! ఇవ్వాళ లేస్తూనే నా మొహం నేనే జూసుకొన్నా. ఏమిటీ శుభ శకునాలను కొంటూండగా, ఇంటాయన శచీదేవిలా డైరెక్టుగా అమృతభాండం అందిస్తున్నట్లు కాఫీ కప్పందించాడు. తరువాత పేపర్లోకి దింపాడు. రాజకీయాల్లో ఓలలాడించాడు. ఆ తరువాత ఊళ్ళోకి లాక్కొచ్చాడు.

"మొత్తంమీద మనూరికి ప్రమోషనిప్పించారు మేష్టారు" అన్నాడు.

"ఎప్పుడో యివ్వాలి సార్! ఐదున్నర లక్షల జనాభా వున్న ఊరిని ఇప్పుడా కార్పొరేషన్ చేసేది? ఎప్పుడో చెయ్యాలి" అంటూ నాన్‌స్టాప్‌గా చెప్పి కొరబోతున్న కంఠాన్ని సవరించుకున్నాను.

"ప్రమోషనొచ్చినందుకు మీకు యాభై రూపాయలు ఇంక్రిమెంటివ్వాలి మేష్టారూ" అని నవ్వుల పువ్వులొలికించి గిల్లి మరీ చెప్పాడు.

అబ్బ! అబ్బ!! అనుకొంటూ ఇంటాయన సరసానికి లెక్కలేనన్ని ఆనంద బాష్పాలు రాల్చి పారేసి, పట్టలేని ఆనందంతో పరవశించిపోయాను.

రెండ్రోజులయ్యాక ఇంటద్దె ఇవ్వడానికెళ్ళాను. అంతే!

ఆనందం ఢాం ఢాం ఢాం!

ఓరచూపు కోరచూపులా —

ఆఫీసరు యమధర్మరాజులా —

రాజకీయం ముళ్ళకంచెలా —

శచీదేవి శూర్పణఖలా —

అమృతం విషంలా —

ఊరికి ప్రమోషనొస్తే ఇంటద్దెకి ఇంక్రిమెంట్ పెరిగింది—

నీతి: ఉద్యోగస్తులకి ప్రమోషన్లురావు.

త్వరగా
మూలశంకకు
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా? తీవ్రంగా దురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స. ఎంత మాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారి తీసి-శస్త్రచికిత్స తప్పనిసరి కాతుంది. సకాలంలో హెడెన్సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేచనము. 108 దేశాలలో వైద్యులందరూ సిఫారసు చేస్తున్నారు! హెడెన్సాలో ఉండే అమోఘమైన మందులు శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది-విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు.

గమనించండి సకాలంలో హెడెన్సా చికిత్స చేసుకుంటే ముమ్మందు శస్త్రచికిత్స అవసరముండదు!

3627 TG